బస్తీ మే బకెట్ బిర్యానీ!

- విస్తృతంగా వెలుస్తున్న అమ్మకం సెంటర్లు
- నో సిట్టింగ్.. ఓన్లీ పార్సిల్స్
- బకెట్ పరిమాణాన్ని బట్టి ధరలు
- ఆసక్తి చూపుతున్న భోజన ప్రియులు


విభిన్న సైజుల్లో బిర్యానీ పార్శిల్‌కి సిద్ధంగా ఉన్న రెడ్ బకెట్‌లు


బిర్యానీ పార్సిల్ కోసం వేచి చూస్తున్న కస్టమర్లు..

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: బిర్యానీ అంటే తెలియని వారుండరు. నాన్ వెజ్ బిర్యానీ అంటే ఆసక్తిని కనబరుస్తారు. ఒకప్పుడు పండుగలు, పబ్బాలకు మాత్రమే ఇళ్లలో మాంసాహార వంటలు ఉండేవి. కానీ ప్రస్తుతం ప్రజల అభిరుచుల్లో రోజురోజుకు మార్పులు వస్తున్నాయి. దీంతో రోజు కొత్త తరహా రుచులను ఆస్వాదించాలని కోరుకుంటున్నారు. మాంసా హారుల కోసం భద్రాచలం పట్టణంలో ఇప్పటికే ఎన్నో రెస్టారెంట్లు, మండి బిర్యానీ సెంటర్లు, పలావ్ సెంటర్లు వెలిశాయి. బిర్యానీ సెంటర్ నిర్వాహకులు సైతం భోజన ప్రియులను ఆకట్టుకునేందుకు కొత్త కొత్త వెరైటీ పద్ధతులను ఆచరిస్తున్నారు. ఇటీవల కాలంలో భద్రాచలం పట్టణంలో వెలసిన రెడ్ బకెట్ బిర్యానీ సెంటర్‌తో పాటు మరో రెండు బకెట్ బిర్యానీ పాయింట్లు పట్టణ వాసులను ఆకర్షిస్తున్నాయి. చికెన్, మటన్, ఫిష్, రొయ్యలు, ఎగ్ బిర్యానీలు, అన్ని రకాల స్నాక్స్ రుచికరంగా లభిస్తుండడంతో మాంసం ప్రియులు క్యూ కడుతున్నారు. బకెట్ రూపంలో పార్సిల్‌గా ఇవ్వడంతో బిర్యానీ రుచి చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

టేస్ట్ అదుర్స్..

మామూలుగా బిర్యానీ సెంటర్లు అంటే కూర్చొని తినేందుకు వీలుగా ఉంటుంది. కానీ బకెట్ బిర్యానీ సెంటర్ నిర్వాహకులు కేవలం పార్శిల్ గానే బిర్యానీని కస్టమర్లకు అందజేస్తున్నారు. ఇక్కడ లభించే బిర్యానీ రుచికరంగా, నాణ్యతగా ఉండడంతో కస్టమర్లు టోకెన్లు తీసుకొని గంటల తరబడి మరీ వేచి చూస్తున్నారు. భద్రాచలంలో వెలసిన బకెట్ బిర్యానీ సెంటర్లను పట్టణ వాసులనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఇష్టపడుతున్నారు.

పరిమాణాన్ని బట్టి ధరలు..

ఇక్కడ లభించే బిర్యానీలు బకెట్ పరిమాణాన్ని బట్టి ధరలు ఉన్నాయి. రూ.160ల బకెట్ బిర్యానీ ఒక వ్యక్తికి సరిపోయే విధంగా మొదలుకొని, రూ.1500ల బకెట్ బిర్యానీ దాదాపు 10 మందికి సరిపడేలా లభిస్తుంది. ఇదే కాకుండా మటన్, రొయ్యలు, ఫిష్ బిర్యానీ కూడా లభిస్తుండడంతో బకెట్ బిర్యానీ సెంటర్‌లకు బారులు తీరుతున్నారు. రూ.800లకు చికెన్, మటన్, ఫిష్, రొయ్యలతో కూడిన స్పెషల్ రెడ్ బకెట్ బిర్యానీ కూడా లభిస్తుండడం మరో ప్రత్యేకత. తక్కువ ధరల్లో నాణ్యమైన, రుచికరమైన బిర్యానీ దొరకడంతో భోజన ప్రియులు తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రుచికరంగా ఉంది..



రెడ్ బకెట్ బిర్యానీ అంటే నోరూరిపోతోంది. అంతా బాగా బిర్యానీని అందిస్తున్నారు. రుచితో పాటు మంచి సువాసన కలిగి ఉంది. బిర్యానీ బకెట్ పార్శిల్గా ఇవ్వడం చాలా డిఫరెంట్‌గా ఉంది. పైగా ధరలు కూడా తక్కువగా ఉన్నాయి. బకెట్ పరిమాణాన్ని బట్టి ధరలు మారుతున్నాయి.

– రాజు, రాజీవ్ నగర్ కాలనీ, భద్రాచలం

ఆదరణ పెరిగింది..



కస్టమర్ల నుంచి రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. కేవలం పార్శిళ్లు కావడంతో చాలా మంది చిన్నపాటి ఫంక్షన్లకు, ఇళ్లకు తీసుకెళ్తున్నారు. భోజన ప్రియులకు తగ్గట్టు గానే నాణ్యమైన, రుచికరమైన వంటకాలను అందిస్తున్నాం.

– శ్రీనివాస్, రెడ్ బకెట్ బిర్యానీ నిర్వాహకుడు, భద్రాచలం

క్లుప్తంగా

యథేచ్ఛగా మట్టి తరలింపు

ములకలపల్లి: మండలపరిధిలోని సీతారామ ప్రాజెక్ట్ కాలువ మట్టి, గ్రావెల్‌ను దర్జాగా బయటికి తరలిస్తున్నారు. రామాంజనేయపురం, సత్యంపేట శివారులోని సీతారామ కాలువ ఎస్కేప్ సమీపాల్లో గత మూడు రోజులుగా రాత్రి వేళల్లో సాగుతోంది. అయినప్పటికీ ఈ దందాపై దృష్టి సారించేవారే కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువ కట్టకు బలం కోసం వేసిన మట్టిని ఇష్టారాజ్యంగా జేసీబీలతో తవ్వి లారీల్లో వెంచర్లకు తరలిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రేడియం స్టిక్కర్లు తప్పనిసరి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం పట్టణంలో ప్రధాన కూడళ్లలో నిబంధనలు పాటించని ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనంతరం వాటన్నిటికీ వెనుక వైపున రేడియం స్టిక్కర్లు వేయించారు. సంబంధితన డ్రైవర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ మాట్లాడారు. రాత్రివేళల్లో ఆగి ఉన్న భారీ వాహనాలు కనిపించక వెనుక నుంచి వచ్చే వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నాయని, దీనిని నివారించేందుకు వాహన వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్ తదితరులు, పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తప్పించాలి

మణుగూరుటౌన్: మెప్మాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఉద్యోగం నుంచి తప్పించి విచారణ చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట 15 రోజులుగా మెప్మా సీఓపై విచారణ చేసి విధుల నుంచి తొలిగించాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్షలు చేస్తున్న రావుల కుమారస్వామి, శ్రీదేవిల దీక్షా శిబిరాన్ని ఆయన సీపీఐ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏసీ ధర్నా

మణుగూరుటౌన్: రామగుండంలో నిర్మించబోయే 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా శనివారం బీటీపీఎస్‌లో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న విరామ సమయంలో ధర్నా నిర్వహించి నాయకులు మాట్లాడారు. తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్ అసోసియేషన్ బీటీపీఎస్ బ్రాంచ్ అధ్యక్షుడు బి.రవి ప్రసాద్, జేఏసీ నాయకులు రాజబాబు, రవితేజ, కార్మిక సంఘ నాయకులు ప్రసాద్, కృష్ణ, వెంకట్రాం, వీరస్వామి, సిద్దుల హుస్సేన్, మహిళా నాయకురాళ్లు అల్తాఫా, కల్పన తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులు..

అశ్వాపురం: నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మికులు శనివారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మిట్టగూడెంలో రథంగుట్ట వద్ద వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంటు వద్ద కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి నాయకులు మిషన్‌భగీరథ కార్మికుల సమ్మె విషయం తెలియజేయగా వెంటనే ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి కార్మికుల వేతనాలు వెంటనే ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

కుంకుమాభిషేకం..

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శనివారం అమ్మవారికి కుంకుమాభిషేకం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీరంగమ్ వెంకటాచార్యులు, ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేసి, రైతులకు అందబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మండలపరిధిలోని కమలాపురంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ శాఖా మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, కుంజా రామ్మూర్తి. గొగ్గెల ఆదినారాయణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పలువురి పరామర్శ

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొర్స చిలకమ్మ తల్లి కొర్స ఎర్రబుచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, నాయకులు ఎంబీ నర్సారెడ్డి, పుల్లయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి


మణుగూరుటౌన్: ఏటీసీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: విద్యార్థులు ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుని శిక్షణా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కన్విశేషన్ పుస్తకాల పంపిణీతో పాటు రూ.4.65 కోట్ల విలువైన ఏటీసీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ విద్యార్థులకు పారిశ్రామిక అవసరమని గుర్తించి 2008లో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేటి వరకు కళాశాల అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేశారు. రూ.10లక్షల అంతర్గత రోడ్లు, రూ. 10లక్షల ప్రహరీ గోడ, రూ.10లక్షల ఆర్ఓఆర్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏటీసీ భవనం ప్రారంభానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, శివ సైదులు, నాయకులు గుడిపూడి కోటేశ్వరరావు, గోరంట్ల కనకయ్య, గాండ్ల సురేశ్, నియోజకవర్గ యువజన నాయకులు కొర్సా ఆనంద్, ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రభాకర్, ట్రైనింగ్ ఆఫీసర్ రవి, సూపరింటెండెంట్ జ్యోతి రాణి, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఇక్తార్, ఏటీఓలు ఎం.శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, ఏ.నర్సయ్య, ఏటీసీ ఇన్‌చార్జ్ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురంలో పర్యటన

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండల కేంద్రంలో శనివారం పర్యటించారు. కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో తురుములగూడెం గ్రామంలో 6.25 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను, గొల్లగూడెం గ్రామంలో 6.25 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కొమ్ముగూడెం గ్రామంలో గ్రామస్తులతో ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. తహసీల్దార్ స్వర్ణలత, ఏఈ చక్రధరాచారి, ఏపీఓ సీతారాములు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ..

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్యను ఆయన నివాసంలో శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువైన వస్తువులు భద్రం..

దమ్మపేట: దసరా సెలవులకు కుటుంబ సమేతంగా ఊరి ప్రయాణాలు చేసేవారు, తమ బంగారు, వెండి, నగదు తదితర విలువైన వస్తువులను ఇంటిలో ఉంచకుండా జాగ్రత్త పరచుకోవాలని ఎస్సై సాయికిషోర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఊరికి వెళ్లేవారు తగువిధంగా ఇంటికి తాళం వేసి, వారి ఇంటి సమాచారమును ఫోన్ నంబరు 8712682065కు వాట్సాప్ ద్వారా పంపాలని తెలిపారు. తద్వారా ఊరికి వెళ్లిన వారి ఇళ్ల ఎదుట గస్తీ పెంచుతామని ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న సర్వే

ములకలపల్లి: ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే చురుగ్గా సాగుతోంది. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మండలపరిధిలోని ముత్యాలంపాడు గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ లక్ష్మయ్యల ఆధ్వర్యంలో మూడు బృందాలు గత మూడు రోజులుగా ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్న విషయం విదితమే. 178 కుటుంబాలు ఉన్న ఈగ్రామంలో ఇంటింటికీ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ధేశిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు.

నేత్రదానం..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన వానపల్లి పుణ్యవతి (73) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందగా.. కుటుంబ సభ్యులు ఆమె రెండు కళ్లను దానం చేశారు. ఈ ప్రక్రియను అంతా వ్యక్తి మృతి చెందిన 8 గంటల లోపు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పుణ్యవతి రెండు నేత్రాలను ఆమె కుమారుడు బాలసుబ్రమణ్యం హైదరాబాద్‌కు చెందిన అగర్వాల్ ఐ బ్యాంక్ సంస్థ రిప్రెసెంటేటివ్ జానీకి అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 7288084777 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆయన తెలిపారు.

సింగరేణిలో మినహాయింపు ఇవ్వాలి

మణుగూరుటౌన్: పెర్క్స్‌పై టాక్స్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలు చేస్తున్నట్లుగానే సింగరేణిలో మినహాయింపు చేయాలని ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. శనివారం ఏరియా వర్క్‌షాప్, ఆటో వర్క్‌షాప్‌లలో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దసరా అడ్వాన్స్ విషయంలో ఆదాయపు పన్ను పడుతుందని సింగరేణి లాభాల వాటా విషయంలో అబద్ధపు ప్రచారాలు చేయడం ద్వారా కార్మికులను అయోమయానికి గురయ్యారని, ఈ పద్ధతులను మానుకోవాలని అన్నారు. క్యాంటీన్‌లో అల్పాహారంలో వచ్చిన బొగ్గు ముక్కల అంశంపై విజిలెన్స్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, గంగాధర్, ఆదర్ల సురేందర్, రాజేశ్, శ్రావణ్‌కుమార్, రంజిత్ తదితరులు ఉన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. తొలి రోజు బాలా త్రిపుర సుందరిగా, రెండో రోజు గాయత్రిదేవిగా భక్తుల పూజలందుకున్న అమ్మవారు.. మూడో రోజు అన్నపూర్ణా దేవిగా కనిపించారు. సాక్షాత్తు పరమేశ్వరుడికే భిక్షపెట్టిన అన్నపూర్ణాదేవిని ధ్యానించాలని అర్చకులు పేర్కొన్నారు. అయితే, కొన్నిచోట్ల అమ్మవారు గజలక్ష్మి, మంగళగౌరి అలంకరణలో దర్శనమిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంటౌన్: అన్నపూర్ణా దేవి అలంకరణలో అమ్మవారు..


కరకగూడెం: అమ్మవారి వద్ద భక్తులు


అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో మంగళగౌరిదేవి అలంకరణలో అమ్మవారు

దత్తత గ్రామంలో అభివృద్ధికి బాటలు


మహ్మదీనగర్‌లో మైనారిటీ మహిళలతో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం భూమిపూజ చేశారు. నిరుపేద ముస్లిం మైనారిటీలు అధికంగా ఉన్న ఈ గ్రామాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత తీసుకున్న విషయం విధితమే. ఈ క్రమంలో గ్రామభివృద్ధికి రూ.1.85 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. గ్రామం మొత్తం సీసీరోడ్లు, తాగునీటి సదుపాయం, పూర్తిస్థాయిలో డ్రెయిన్‌ల నిర్మాణాలు చేపట్టనున్నారు. సదరు నిధులు ఉపాధి పథకం ద్వారా మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అదే విధంగా గ్రామంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా రూ.4.50 లక్షల నిధులతో రెండు చేతిపంపులు మంజూరు చేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రత్యేకంగా నూతన భవనాలు, ప్రహరీల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం టేకులబంజర్‌లో రూ. 6.40 లక్షల నిధులతో చేపట్టనున్న గ్రావెల్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే జారే భూమిపూజ చేశారు. కేరళ తరహా అంగన్‌వాడి భవనాలకు శంకుస్థాపన మండలంలోని మద్దుకూరు, అన్నారంతండా గ్రామాలకు మంజూరైన కేరళ తరహా అంగన్‌వాడి కేంద్రాల నూతన భవనాల నిర్మాణాలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భూమిపూజ చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా అశ్వారావుపేట నియోజకవర్గానికి తొలివిడతగా రెండు భవనాలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. కేంద్రప్రభుత్వం నీతిఆయోగ్ పథకం ద్వారా మంజూరు చేసిన ఈ భవనాలు పిల్లలను ఆకట్టుకునేలా ఉంటాయన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, మాజీ ఎంపీపీ బాణోత్ పార్వతి, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బి.అశోక్, వివిధ శాఖాధికారులతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, ఉప్పతల ఏడుకొండలు, నల్లమోతు రమణ, కృష్ణారెడ్డి, ఎస్డీ సైదా, ఎస్డీ అజ్గర్, దారావత్ రామారావు, బడుగు కృష్ణవేణి, దారం గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వన్య ప్రాణులను కాపాడుదాం..


కందిపాడులో మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ద్వాలియా

చర్ల: వన్యప్రాణులను కాపాడుదామని, అందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని చర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ద్వాలియా పిలుపునిచ్చారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కందిపాడులో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవులను పెంచాలని, వన్యప్రాణులను సంరక్షించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. వన్యప్రాణులను సంహరిస్తే తీవ్ర చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చర్ల రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు


అశ్వారావుపేటరూరల్: బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, కొత్త మామిళ్లవారిగూడెం, ఆసుపాక, నారాయణపురం, గుమ్మడవల్లితోపాటు పలు గ్రామాల్లో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, యువతులు రంగు రంగు పూలతో బతుకమ్మలను తయారు చేసి అమ్మవారి మండపాల వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఆట, పాటలతో సందడి చేశారు. అలాగే బతుకమ్మలను సమీపంలోగల చెరువుల్లో నిమజ్జనం చేశారు.

జూనియర్ కాలేజీలో..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణవేణి పర్యవేక్షణలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి కళాశాల ప్రాంగణంలో ముగ్గులు వేసి వాటి మీద బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎం.శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకా జయంతి వేడుకలు


మణుగూరుటౌన్: మాట్లాడుతున్న ఏరియా జీఎం రాంచందర్

కరకగూడెం: కాకా వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్ఐ కృష్ణ ప్రసాద్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కోసం కాకా వెంకటస్వామి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాలమహానాడు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. పాల్‌రాజు, వంశీ, ఏవీ.రావు, కొండ, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: తెలంగాణ తొలితరం ఉద్యమ నేత వెంకటస్వామికి సింగరేణితో అనుబంధం మరుపురానిదని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శనివారం జీఎం కార్యాలయంలో వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెంకటస్వామి సింగరేణి కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగులకు అనేక సంక్షేమ పథకాలు అమలుకు శ్రీకారం చుట్టి పెన్షన్ స్కీంకు కృషి చేశారన్నారు. ఏరియా అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఐటీసీ ఆర్థిక చేయూత

బూర్గంపాడు: అక్టోబర్ 4 నుంచి 13 వరకు సౌత్ ఆఫ్రికాలోని సన్‌సిటీలో జరగనున్న కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్న మోడెం వంశీకి ఐటీసీ పీఎస్‌పీడీ రూ.50 వేల ఆర్థిక చేయూతనందించింది. శనివారం సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ చెంగలరావు పవర్ లిఫ్టర్ వంశీకి రూ 50వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో సిటీ స్టైల్ జిమ్ నిర్వహకుడు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.వెంకటరామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంక కృష్ణాజీ, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, గాదె రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వాలి

గుండాల: దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే పంట రుణాలు అందించాలని రైతుకూలి సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బచ్చల సారయ్య, కొమరం సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. ఇప్పటి వరకు బ్యాంకులో 400 మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, ఆ రుణాలు సకాలంలో అందక మండలంలోని ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన బ్యాంకు మేనేజర్ రీజనల్ మేనేజర్‌తో ఫోన్‌తో మాట్లాడారని తెలిపారు. ఆయన స్పందిస్తూ దరఖాస్తులను పరిశీలించి, రుణాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఈసం మంగయ్య, పెంటన్న, వజ్జ ఎర్రయ్య, బుచ్చయ్య, గిరిజయ్య, పొట్టయ్య, రామారావు, సుధాకర్, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.